క్లుప్తంగా

నేటి నుంచి కోదండరామ స్వామి తిరునాళ్ల

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రెడ్డిగారిపల్లెలో కోదండరామస్వామి తిరునాళ్ల రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం సీతారాముల శాంతి కల్యాణోత్సవం, శుక్రవారం వనభోజనాల కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఆదివారం గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రేపు శానంపూడిలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు

సింగరాయకొండ(మర్రిపూడి): సింగరాయకొండ మండలం శానంపూడి గ్రామంలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం ఈనెల 17వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు చిలకపాటి సుధాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భం స్వామికి అభిషేకం, పూజలు, మహానివేదన జరుగుతుందని భక్తులకు అన్నప్రసాద సంతర్పణ, సాయంత్రం పిల్లలకు ఆటలపోటీలు, రాత్రి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బ్రాందీషాపు వద్ద ఘర్షణలో ఇద్దరికి గాయాలు

లింగసముద్రం: మండల కేంద్రమైన లింగసముద్రంలోని బ్రాందీషాపు వద్ద బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు బీరు సీసాలతో దాడి చేసుకున్నారు. ఈ సంఘటనలో ఇద్దరికి రక్త గాయాలు కావడంతో స్థానిక ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై ఎస్సై ఎం.బాజీబాబును వివరణ కోరగా తమకు ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

గిద్దలూరు రూరల్: స్థానిక గ్రంథాలయంలో బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించినట్లు గ్రంథపాలకురాలు ఎస్ఎం ప్రసన్నకుమారి తెలిపారు. జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఉదయం 8 గంటలకు కథలు చదివించడం, 10 గంటలకు పుస్తక సమీక్ష, 10.30 గంటలకు కథలు చెప్పడం, 11 గంటలకు డ్రాయింగ్, పెయింటింగ్, డ్యాన్స్ నేర్పిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లైబ్రేరియన్ కోరారు.

ముస్లిం మైనార్టీలకు ధన్యవాదాలు

మార్కాపురం టౌన్: ఈనెల 13న నిర్వహించిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో మార్కాపురం ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి ఓటు వేసిన ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ గౌస్ మొహిద్దీన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి సీఎం ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని, ఒంగోలు ఎంపీగా డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా అన్నా రాంబాబు విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మైనార్టీల సంక్షేమానికి వైఎస్ జగన్ చేసిన కృషిని అందరూ గుర్తించారని, భవిష్యత్తులో కూడా ఇదే ఆదరణ చూపాలని కోరారు.

కాయ్..రాజా కాయ్!

పుల్లలచెరువు: సార్వత్రిక ఎన్నిక పోరు ముగిసింది. గెలుపు తమదంటే తమదని ఆయా పార్టీల నేతలు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దీంతో ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. గెలుపోటములపై పందెలు కూడా అదే స్థాయిలో ఊపందుకున్నాయి. తమదే విజయం అంటూ ఆయా పార్టీల అభిమానులు బెట్టింగ్‌లకు సిద్ధం అవుతున్నారు. కేవలం నియోజకవర్గం, జిల్లాలోనే కాకుండా 175 స్థానాలపై కూడా పందెలు జోరుగా సాగుతున్నాయని ప్రజలు గ్రామాల్లోని రచ్చబండల వద్ద చర్చించుకుంటున్నారు. కొంతమంది వైఎస్సార్ సీపీ, టీడీపీ ప్రభుత్వాలు ఏర్పాటు మధ్య బెట్టింగ్‌లు కాస్తున్నారు.

అనాథలను అక్కున చేర్చుకున్న కాశయ్య

కురిచేడు: మండలంలోని శ్రీకరుణా వృద్ధాశ్రమం నిర్వాహకుడు కాశయ్య బుధవారం నరసరావుపేట రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఇద్దరు అనాథ వృద్ధులను తన ఆశ్రమానికి తీసుకొచ్చారు. పల్నాడు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న నారాయణమూర్తి ఇచ్చిన సమాచారం మేరకు నరసరావుపేట వెళ్లి వారిని తీసుకొచ్చినట్లు కాశయ్య తెలిపారు. ఓ వృద్ధురాలు, వృద్ధుడు దిక్కు లేని స్థితిలో చెట్లకింద తలదాచుకుంటున్నారు. వారితో అక్కడే స్నానం చేయించి దుస్తులు ఆశ్రమానికి తీసుకొచ్చారు.

కారు..పాల వాహనం ఢీ

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని తూర్పుగంగవరంలో కారు- పాల వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. బొద్దికూరపాడు నుంచి దర్శి వెళ్తున్న కారు తూర్పుగంగవరంలో రోడ్డుపైకి వస్తున్న సమయంలో ఒంగోలు నుంచి తూర్పుగంగవరంలోకి వస్తున్న పాలవాహనం.. కారును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు లేక పోవడంతో పాటు ఆ సమయంలో ఆ మార్గంలో పాదచారులు ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

రూ.119 కోట్ల పొగాకు అమ్మకాలు

కొండపి(సింగరాయకొండ): నాలుగు రౌండ్లలో సుమారు రూ.119 కోట్ల పొగాకు అమ్మకాలు జరిగినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. వేలం కేంద్రంలో 57 రోజుల నుంచి పొగాకు వేలం జరుగుతుందని, ఇప్పటి వరకు నాలుగు రౌండ్ల వేలం నిర్వహించామన్నారు. నాలుగు రౌండ్లలో సరాసరి ధర రూ.236.84, గరిష్ట ధర రూ.300, కనిష్ట ధర రూ. 205 పలికిందని పేర్కొన్నారు. అమ్మకాలు జరిగిన పొగాకులో బ్రైట్ గ్రేడ్ 15 శాతం, మీడియం గ్రేడ్ 16 శాతం, లో గ్రేడ్ 69 శాతం ఉందన్నారు. ఇప్పటి వరకు 42 కంపెనీల వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. గురువారం నుంచి వేలంలో ఐదో రౌండ్ వేలం ప్రారంభం అవుతుందని తెలిపారు.

కొండపి(సింగరాయకొండ): స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ.264.01 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. వ్యాపారులు వెన్నూరు, చిన్నవెంకన్నపాలెం గ్రామాలకు చెందిన రైతులు 826 బేళ్లను తీసుకొని రాగా 781 బేళ్ల కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 45 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ 300, కనిష్ట ధర రూ.205.సరాసరి ధర రూ.264.01 పలికింది. వేలంలో 21 మంది వ్యాపారులు పాల్గొన్నారు.


టంగుటూరులో వేలంలో పాల్గొన్నా వ్యాపారులు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర రూ. 264.65 పలికింది. రీజియన్‌లోని అన్ని వేలం కేంద్రాల కన్నా అధికంగా నమోదైంది. వేలం కేంద్రానికి ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, జయవరం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 1043 బేళ్లను వేలానికి తీసుకురాగా 987 బేళ్లను కొనుగోలు చేసి 56 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.300, కనిష్ట ధర రూ.205, సరాసరి రూ. 264.65 ధర పలికింది. వేలంలో మొత్తం 36 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహనాధికారి శ్రీనివాస రావు తెలిపారు.


మాట్లాడుతున్న వేలం నిర్వణాధికారి సునీల్‌కుమార్

ఘనంగా ఎమ్మెల్యే బుర్రా జన్మదిన వేడుకలు

లింగసముద్రం: వైఎస్సార్ సీపీ కందుకూరు అభ్యర్థి, ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలను పార్టీ మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు షేక్ షఫి, మాజీ సర్పంచ్ మాచేపల్లి మాల్యాద్రి, మండల అధికార ప్రతినిధి బట్టరుశెట్టి రాఘవనాయుడు, జిల్లా సేవాదళ్ కార్యదర్శి ఉండేల ఆదినారాయణరెడ్డి, నాయకులు గొర్రెపాటి చినచెంచురామయ్య, మట్టె మాల్యాద్రి, బి.వెంకటేశ్వర్లు, కొమ్మి పోతులూరయ్య, పూరిమిట్ల శ్రీను, బొల్లినేని హనుమంతరావు, గుర్రం రామారావు, కోనూరు శివరామయ్య, గోగుల గురుచంద్, కిలారి సురేంద్ర, మాటూరి సురేష్, ఎర్రజొన్న చెన్నకేశవులు, నలబోలు మాల్యాది పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుర్రా మధుసూదన్ యాదవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి రిటైర్డు వీఆర్‌ఓ కాకు వెంకటస్వామి హాజరై కేక్ కట్ చేశారు. కార్యకర్తలు వీరాస్వామి, కిష్టయ్య, గోపి, హనుమంతురావు, శింగయ్య, ఇరుపని అంజయ్య, యాదవ యూత్ ఫోర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న బుర్రా మధుసూదన్‌యాదవ్

ఘనంగా బుర్రా పుట్టినరోజు వేడుకలు

కందుకూరు: వైఎస్సార్ సీపీ కందుకూరు అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ పుట్టిన రోజు వేడుకలను బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. పార్టీ నాయకులు, అభిమానులు మధ్య పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందని, ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడి పనిచేశారని అభినందించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల కష్టం వల్లే ఎన్నికల్లో బలంగా పోరాడామని, జూన్ 4న వెలువడే ఫలితాల్లో కచ్చితంగా విజయం సాధిస్తామనే ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు బుర్రా పెద్ద ఎత్తున పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు.


లింగసముద్రంలో కేక్ కట్ చేస్తున్న నేతలు


వలేటివారిపాలెంలో బుర్రా పుట్టినరోజు వేడుకలు

ఉరకలెత్తిన ఉత్సాహం

మార్కాపురం టౌన్/కొనకనమిట్ల: సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం పట్టణ ప్రజలు భారీ సంఖ్యలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత సోమవారం ఉదయం 7 గంటలకు ముందు నుంచే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మధ్యాహ్నం ఎండ కారణంగా పోలింగ్ మందకొడిగా సాగినా సాయంత్రం 3.30 గంటల నుంచి పోలింగ్ శాతం పెరిగింది. రాత్రి 9 గంటల వరకు ప్రజలు పోలింగ్ కేంద్రాల్లో ఉండి ఓటు వేశారు. కాగ పట్టణంలోని పలు బూత్‌ల్లో అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. 78వ బూత్‌లో నూరు శాతం, 48వ బూత్‌లో 94.60 శాతం, 33వ బూత్‌లో 88.77, 32వ బూత్‌లో 86.08, 31లో 85.20 శాతం నమోదైంది.


గొట్లగట్టులో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు

కొనకనమిట్లలో 90 శాతం పోలింగ్

కొనకనమిట్ల మండలంలో 38072 మంది ఓటర్లు ఉండగా వారిలో 34552 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రామ పంచాయతీల వారీగా పోలింగ్ వివరాలు ఇలా ఉన్నాయి. గనివానిపాడులో 668 మందికి 647 మంది, వాగుమడుగులో 2550 మందికి 1846, మునగపాడులో 1728 మందికి 1604, వెలిగండ్లలో 1250కి 1156, మంగాపురంలో 652కు 603, నాగరాజుకుంటలో 1202కు 1127, చింతగుంటలో 1242కు 1162, వద్దిమడుగులో 1204కు 1116, నాగిరెడ్డిపల్లిలో 619కి 585, గార్లదిన్నెలో 797కు 743, రేగుమానిపల్లిలో 1476కు 1387, ఎదురాళ్లపాడులో 986కు 933, తువ్వపాడులో 1521కి 1372, కొనకనమిట్లలో 2333కు 2096, సిద్ధవరంలో 2277కు 2005, కాట్రగుంటలో 2217కు 1980, వింజవర్తిపాడులో 456 మందికి 413, సలనూతలలో 1008కి 876, చినమనగుండంలో 1433కు 1315, గొట్లగట్టులో 3153కు 2894, నాగంపల్లిలో 1111కు 1000, గరిమినపెంటలో 1298కి 1193, ఇరసలగుండంలో 910కి 799, బచ్చలకూరపాడులో 777కు 723, చినారికట్లలో 2281కి 1991, పెదారికట్లలో 3443కు 2986 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మండలంలో వైఎస్సార్ సీపీ వైపే ఓటర్లు మొగ్గు చూపారని ఆ పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

జగనన్నే మళ్లీ సీఎం


పోలింగ్ బూత్ వద్ద క్యూలో ఉన్న మహిళలు

యర్రగొండపాలెం: సంక్షేమ రథసారధి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు భారీ ఎత్తున మహిళలు తరలివచ్చి ఈవీఎంల్లో ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో మహిళలు ఎక్కువ శాతం పాల్గొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 1,01,982 మహిళా ఓటర్లు ఉండగా 91,296 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ శాతం మహిళలు ఓట్ల పండగలో పాల్గొనడం వైఎస్సార్ సీపీకి శుభ సూచికమని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ఐదు సంవత్సరాల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు పెద్ద పీట వేశారు. 132 సార్లు బటన్‌నొక్కి మహిళామణుల ఆర్థిక స్వాలంబనాన్ని పెంచిన ఆయనకు తాము రెండు సార్లు బటన్ నొక్కలేమా అంటూ పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. పోలింగ్‌కు తరలి వస్తున్న మహిళలను చూసి పచ్చ నేతలకు చెమటలు పట్టాయి. ఎండలను సైతం లెక్క చేయకుండా మహిళలు గుంపులు, గుంపులుగా తరలి రావడం వారి గుండెల్లో గుబులు పుట్టించింది. జగన్‌మోహన్‌రెడ్డే రాష్ట్ర నాయకత్వం వహించాలన్న ఉద్దేశంతో యువతులు, అవ్వలు, మహిళా దివ్యాంగులు సైతం పోలింగ్ బూత్‌ల వద్దకు వచ్చి తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు ఎక్కువ శాతం పోలింగ్‌లో పాల్గొనడాన్ని చూస్తే పచ్చ కూటమి రాష్ట్రం వదిలి పారిపోవాల్సిందేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. వై నాట్ 175 అంటూ జగనన్న చేసిన నినాదం నిజం కాబోతోందని, అధికారం తమదేనని చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ వచ్చే నెల 4వ తేదీ వరకు పగటి కలలు కనాల్సిందేనని వారు పేర్కొంటున్నారు.

గిరిజన గురుకుల విద్యాలయంలో దరఖాస్తుల ఆహ్వానం

ఉలవపాడు: మండల పరిధిలోని కరేడు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య తెలిపారు. 2024-25 సంవత్సరానికి మూడో తరగతిలో 40 సీట్లు, నాల్గవ తరగతిలో 35 సీట్లు, ఐదో తరగతిలో 26 సీట్లు, ఆరో తరగతిలో 21 సీట్లు, ఏడో తరగతిలో 7 సీట్లు, 8 వ తరగతిలో 10 సీట్లు, 9వ తరగతిలో 21 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల 25వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తామన్నారు. వివరాలకు 8639256806 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష

గుడ్లూరు: ఉపాధి హామీ పనులపై స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఏపీఓ అబ్దుల్లా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా కాస్తున్నందున్న కూలీలు ఉదయం ఆరు గంటలకే పని ప్రదేశాలకు చేరుకొని 10 గంటలు వరకు పనులు చేయాలన్నారు. కూలీలకు ఇబ్బందులు కలగకుండా మంచి నీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఫీల్డు అసిస్టెంట్‌లకు సూచించారు. ఇచ్చిన కొలతలు ప్రకారం పనులు చేసుకుంటే కూలీలకు రూ.300 కూలి పడుతుందన్నారు. మస్టర్లలో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో జరుగుతున్న పనులను టెక్నికల్ అసిస్టెంట్‌లు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలన్నారు. ఉద్యానవన పంటలను ఎక్కువగా సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించారు.


వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

వార్డుల్లో చైర్మన్ గఫార్ పర్యటన

కనిగిరి రూరల్: సమస్య– పరిష్కారంలో భాగంగా పట్టణంలోని తొమ్మిదో వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ బుధవారం పర్యటించారు. స్థానికులు నీటి, పారిశుధ్య సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి తక్షణ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మన్ గఫార్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రహిమాన్, పండు, మన్సూర్, నాగూర్‌బీ, భారతీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనం గడపాలి

కొనకనమిట్ల: గ్రామాల్లో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంత జీవనం గడపాలని ఎస్సై మాధవరావు సూచించారు. మండలంలోని ఎదురాళ్లపాడు, కొత్తపల్లి, కొనకనమిట్ల, సిద్ధవరం, చినారికట్ల గ్రామాల్లో ఆయన పర్యటించి శాంతి భద్రతలపై ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓట్లు వేయలేదని ఎలాంటి గొడవలు పెట్టుకోవద్దని, ప్రశాంత వాతావరణంలో గ్రామాల్లో అందరు కలిసి మెలిసి ఉండాలన్నారు. రెచ్చగొట్టే మాటలు తగదని, చిన్నపాటి విషయాలకే గొడవలు పెట్టుకొని పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి తెచ్చుకోవాలని హితవు పలికారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.


ఎదురాళ్లపాడులో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

నేషనల్ హైవేపై తరచూ కుంగుతున్న చప్టా


హైవేపై కూలిన చప్టా

కంభం: స్థానిక వైజంక్షన్ మూలమలుపు వద్ద జాతీయ హైవేపై ఉన్న చప్టా నెలకోసారి కుంగిపోతుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వివరాలు.. అనంతపురం–అమరావతి హైవేలో కంభం బస్టాండుకు మలుపు తిరిగే వైజంక్షన్ వద్ద డ్రైనేజీపై నిర్మించిన చప్టా తరచూ కుంగిపోతోంది. కుంగిన చోట తాత్కాలికంగా మరమ్మతులు చేసినా అదే పరిస్థితి పునరావృతం అవుతోంది. నిత్యం ఈ మార్గంలో వందలాది బస్సులు, లారీలు, ఆటోలు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. కుంగిపోయిన చప్టాను గమనించక ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి గాయాలైన సందర్భాలు ఉన్నాయి. 15 రోజుల క్రితం చప్టా కుంగిపోయినా హైవే అధికారులు స్పందించకపోవడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కురిచేడులో 92.21 శాతం పోలింగ్


ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

కురిచేడు: సాధారణ ఎన్నికల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసారి పురుషుల కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండను సైతం లెక్క చేయకుండా రాత్రి 9 గంటల వరకు ఓపికగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. కురిచేడు మండలంలో మొత్తం 32,330 ఓట్లు ఉండగా 29,570 ఓట్లు పోలయ్యాయి. 91.82 శాతం రికార్డయింది. 2019 ఎన్నికల్లో 96 శాతం ఓట్లు పోలు కాగా ఈసారి ఈవీఎంలు మొరాయించడంతో పాటు నిదానంగా పనిచేయడంతో ఓట్లు శాతం నమోదైంది. దొనకొండ మండలంలో మొత్తం 37,805 ఓట్లు ఉండగా 34,848 ఓట్లు పోలయ్యాయి. 92.21 శాతం పోలింగ్ నమోదైంది. బూత్‌ల వారీ ఓటర్లు, ఓటు హక్కు వినియోగించుకున్న వారి వివరాలు ఇలా ఉన్నాయి.

తిరుగు పయనమైన ఓటర్లు

త్రిపురాంతకం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లు తిరుగు ప్రయాణమయ్యారు. ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఏదో విధంగా తాము నివాసం ఉంటున్న ప్రాంతాలకు చేరుకునేందుకు రోడ్లపై బారులు తీరి కనిపిస్తున్నారు. మండలానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తిరిగి రెండు రోజులుగా వాహనాలు సమకూర్చుకుని ప్రయాణమై వెళ్తుండగా మరికొందరు మాత్రం బస్సులు, లారీలు వంటి వాహనాల్లో ప్రయాణం చేసేందుకు హైవేపై రోడ్డు పక్కన బారులు తీరి కనిపిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు అనుకూలంగా లేదన్న అభిప్రాయం ప్రయాణికుల నుంచి వ్యక్తమవుతోంది. ప్రయాణికులకు తగిన విధంగా రవాణా శాఖ బస్సులు నడిపితే తమ గమ్యస్థానాలకు చేరుకుంటామని, తిరిగి తమ పనుల్లో చేరేందుకు అవకాశం ఉంటుందని వారంటున్నారు. ఎన్నికల నిమిత్తం ప్రత్యేక వాహనాల్లో వచ్చిన వారు తిరిగి ప్రయాణంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ కనిపిస్తున్నారు.